క్లుప్తంగా

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

మండల వ్యవసాయశాఖ అధికారి కొమరయ్య



తాండూరు రూరల్: రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కొమరయ్య అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ..జూన్ 5వ తేదీలోపు ధరణిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టా పాసు పుస్తకం(పీపీబీ)నంబర్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, దరఖాస్తు ఫాం పూర్తి చేసి సంబంధిత ఏఈఓలకు అందజేయాలని సూచించారు. ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సబ్సిడీపై అందజేయాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేశ్‌కుమార్

కొడంగల్ రూరల్: రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగు యంత్రాలను సబ్సిడీపై అందజేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేట్ వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు కల్తీతో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయంలో యంత్రాల వినియోగాన్ని పెంచుతూ రైతులకు కూలీల ఖర్చు తగ్గించేందుకు కృషిచేయాలన్నారు. 50శాతం సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు, పనిముట్లను గతంలో ప్రభుత్వం అందించేదని, ఎస్సీ, ఎస్టీలకు 95శాతం రాయితీతో అందజేసేదని గుర్తు చేశారు.

ఘనంగా గురునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్: రాష్ట్ర పోలీస్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలో ఆయన అభిమానులు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు కొడంగల్‌కు వచ్చి గురునాథ్‌రెడ్డికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి తినిపించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, రావులపల్లి మాజీ సర్పంచు రమేష్‌రెడ్డి, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, మాజీ ఉప సర్పంచు గౌసన్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

దుద్యాల్: విజేత ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. ఈ సందర్భంగా సాధారణ వైద్య చికిత్సలతో పాటు బీపీ, షుగర్, స్త్రీ సంబంధిత వ్యాధులపై చికిత్సలు కూడా నిర్వహించారు. గ్రామానికి చెందిన చాలా మంది ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. దాదాపుగా 300 మంది వైద్య పరీక్షలకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. గైనకాలజిస్టు డాక్టర్ పి స్నేహ, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ హరిరామ కృష్ణ, ఆస్పత్రి సిబ్బంది అల్తాఫ్ ఉసెన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు గుర్తింపు కార్డులు

ఏఈఓ శిరీష



రైతులతో మాట్లాడుతున్న శిరీష

యాలాల: ప్రతీ రైతుకు గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు రాస్నం ఏఈఓ శిరీష పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలోని రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ..ప్రతీ రైతుకు 14 నంబర్లతో కూడిన విశిష్ట సంఖ్యను కేటాయించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ రంగ డిజిటలైజేషన్‌లో భాగంగా భూమి ఉన్న ప్రతీ రైతు వివరాలను నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఫార్మర్ ఐడీ కోసం స్థానిక ఏఈఓలకు ఆధార్, పట్టాపాస్‌బుక్కు, ఆధార్ లింక్ చేయబడిన ఫోన్ నంబరు తదితర వివరాలు అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

- ఆయా మండలాల ఎంఈఓలు
- కొనసాగుతున్న బడిబాట
- చిన్నారులకు అక్షరాభ్యాసం

మోమిన్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని మండల విద్యాధికారి మల్లేశం కోరారు. శుక్రవారం వెల్‌చాల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డితో కలిసి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకొంటారన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో బోధించనున్నామన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలేశ్వర్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రఘురాంరెడ్డి, రమేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ బడుల్లో వసతులతో పాటు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని ప్రతిఒక్కరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పూడూరు ఎంపీడీఓ పాండు అన్నారు. మండల పరిధిలోని కంకల్ ప్రాథమిక పాఠశాలలో బడిబాటలో భాగంగా విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనంతో పాటు రెండు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సాయిరెడ్డి, పాఠశాల హెచ్ఎంలు పుష్ప, లక్ష్మణ్, చంద్రశేఖర్, దాతలు రవీందర్, నాయుడు, పంచాయతీ కార్యదర్శి జహంగీర్, ఏపీఎం బందయ్య, ఏఎంసీ చైర్మెన్ సోని, ప్రమీల, సీఆర్పీ జంగయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: పులుమద్దిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

ప్రతిరోజు బడికి పంపించాలి

బంట్వారం: తల్లిదండ్రులు పిల్లల్ని ప్రతీరోజు బడికి పంపించాలని ఎంఈఓ చంద్రప్ప పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కోట్‌పల్లి, కరీంపూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ చిన్నారులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. చిన్నపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆట పాటలతో అక్షరాలు నేర్పించాలన్నారు. చిన్నారులు బడి అంటే భయం వీడేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, డ్రెస్సులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ నర్సింలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

హకీంపేట్‌లో..

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్ బాలికల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అక్షరాభ్యాసం చేయించారు. గ్రామానికి చెందిన కొంత మంది చిన్నారులు పాఠశాలలో ప్రవేశాలు తీసుకున్నారు. వారికి తల్లిదండ్రుల ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం స్వేత, ఉపాధ్యాయులు సక్కుబాయి, అర్షియా బేగం, అస్మా సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులోనే నాణ్యమైన విద్య

అనంతగిరి: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని మండల విద్యాధికారి బాబు సింగ్ అన్నారు. వికారాబాద్ మండలంలోని ఆయా పాఠశాలల్లో అక్షరాభ్యాసం నిర్వహించారు. పులుమద్ది గ్రామ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థుల చేత అక్షరాభ్యాసం చేయించారు అనంతరం నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణి చేశారు.



పూడూరు: కంకల్ పాఠశాల ఆవరణలో..



బంట్వారం: కోట్‌పల్లిలో విద్యార్థులతో ఎంఈఓ చంద్రప్ప



దుద్యాల్: హకీంపేట్ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

పాలకులే అన్యాయం చేశారు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం

బంట్వారం: గత పాలకులే బంట్వారం మండలానికి తీరని అన్యాయం చేశారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 18 గ్రామ పంచాయతీలుగా ఉన్న బంట్వారం మండలాన్ని వేరుచేసి 7 పంచాయతీలకు కుదించారన్నారు. అప్పట్లో 4 అనుబంధ గ్రామాలు జీపీలుగా ఏర్పడడంతో మండలంలోని గ్రామ పంచాయతీల సంఖ్య 11కు చేరిందన్నారు. గత పాలకులు ఉనికిని కోల్పోయేలా చేసి మరింత వెనుకబాటుకు గురి చేశారని ఆయన ధ్వజమెత్తారు. గతంలో 18 గ్రామ పంచాయతీలు ఉంటే ఇందులోంచి ఏకంగా 11 జీపీలను కొత్తగా ఏర్పడిన కోట్‌పల్లిలో కలపడం బాధాకరమన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో మళ్లీ బంట్వారం మండలానికి పూర్వ వైభవం తీసుకొస్తామని ఆయన తెలిపారు. మర్పల్లి, పెద్దేముల్, కోట్‌పల్లి మండలాల్లోని పలు గ్రామాలను బంట్వారం మండలంలో కలిపేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ వేగంగా జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీల సంఖ్యను మరింతగా పెంచి బంట్వారం మండలాన్ని భౌగోళికంగా విస్తరింపజేస్తామన్నారు. మండలంలోని సరిహద్దు గ్రామాలను విలీనమయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు యాదగిరి, శాకం నర్సింలు, నాయకులు మోహన్‌రెడ్డి, రాములు, నర్సింలు, అంజిరెడ్డి, మున్నాబాయి, పంది వెంకటయ్య, అజీం, గౌసు, సిద్ది రాములు, వీరేశం, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశం

డీఎస్పీని సస్పెండ్ చేయాలి

ప్రజా, దళిత సంఘాల డిమాండ్

బషీరాబాద్: దళితులపై దాడి చేసిన అగ్రకుల పెత్తందారులకు వంత పాడుతున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని పలువురు ప్రజా, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బషీరాబాద్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత నెల 18న బెల్కటూర్ గ్రామానికి చెందిన దళిత యువకుడు వినయ్ పెళ్లి బారాత్‌లో అగ్రకుల పెత్తందారులు అమానుషంగా అడ్డుకుని, దాడి చేశారన్నారు. ఈ సంఘటనలో బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఫిర్యాదు చేసినా డీఎస్పీ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నీరుగార్చి అగ్రకులాల వారిని వెనకేసుకొస్తున్నారని డీఎస్పీపై మండిపడ్డారు. వెంటనే ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం ప్రతినిధి చంద్రయ్య, ఎంహెచ్‌పీఎస్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సురేశ్, బలరాం, నరేశ్, రాజు, సాధిక్, బస్వరాజ్, అమీర్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా, దళిత సంఘాల నాయకులు

పేదల సంక్షేమమే ధ్యేయం

- ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్
- లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ



లబ్ధిదారులకు పట్టా ప్రొసీడింగ్స్ అందిస్తున్న రవి నాయక్ తదితరులు

దుద్యాల్: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలో ఈర్లపల్లి గ్రామ పరిధిలోని నాన్య నాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలకు సంబంధించిన ప్రొసిడింగ్‌ను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా అర్హులకు ఇళ్ల పంపిణీ చేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఒక్క ఇళ్లు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమానికి హౌసింగ్ ఏఈ వరుణ్, గ్రామస్తులు కిషన్ నాయక్, హనీబాయి, హన్మ నాయక్, రాహుల్ నాయక్, రతన్ నాయక్, శంకర్ నాయక్, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు నికిత, లలిత, శాంతి బాయి, కవిత తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

దోమ: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ గ్యామా సూచించారు. శుక్రవారం శివారెడ్డిపల్లి పాఠశాలను ఆయన సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేయొదన్నారు. ప్రతీ విద్యార్థికి కార్పొరేట్‌కు దీటుగా విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు నర్సింలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



శివారెడ్డిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న గ్యామా

రెవెన్యూ సదస్సుల్లో సమస్యల పరిష్కారం

- మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి
- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

మోమిన్‌పేట: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో సమస్యలు పరిష్కరిస్తారని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎన్కేపల్లి, సయ్యద్‌అల్లీపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు రెవెన్యూ సదస్సులతో పరిష్కారం లభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విస్తీర్ణం తక్కువ నమోదు, సర్వే నంబర్ మిస్సింగ్, పేర్లలో, కులం, ఇంటి పేర్లను తప్పుగా నమోదైన వాటిని సరిచేసుకోవచ్చన్నారు. పెండింగ్ మ్యూటేషన్, బ్యాక్‌లాగ్ తదితర వాటికి మోక్షం లభిస్తుందన్నారు. ఆదేవిధంగా సాదా బైనామాలను కొన్ని షరతులతో మార్పులు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవీందర్, డిప్యూటీ తహశీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్‌ఐలు గోవర్ధన్, సరిత, రెవెన్యూ సిబ్బంది, కార్యదర్శి తిరుపతమ్మ, నాయకులు సురేందర్, మల్లయ్య, మైపాల్ రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: భూ భారతి రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు జరుగుతుందని తహశీల్దార్ భరత్‌గౌడ్ అన్నారు. అంగడిచిట్టంపల్లి, కెరవెళ్లి, సిరిగాయపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. మండలంలో రెండు టీములుగా ఏర్పడి సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటచారి, ఆర్‌ఐ కావ్య, రెవెన్యూ సిబ్బంది శ్రీనాథ్, లవకుమార్, సంగీత, ఆనంద్, రామక్రిష్ణ, శ్రీనివాస్, పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

యాలాల: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని బెన్నూరు, హాజీపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతుల నుంచి 7దరఖాస్తులు స్వీకరించారని ఆయన తెలిపారు. రెవెన్యూ సదస్సులు ఈ నెల 20 వరకు కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వేణు, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.



యాలాల: దరఖాస్తులు తీసుకుంటున్న తహశీల్దార్ వెంకటస్వామి



మోమిన్‌పేట: మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

అవగాహనతోనే టీబీ నియంత్రణ

మండల వైద్యాధికారి రజిత



మోత్కూర్‌లో టీబీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రజిత

దోమ: అవగాహనతోనే టీబీని నియంత్రించొచ్చని మండల వైద్యాధికారి రజిత అన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని మోత్కూర్ సబ్ సెంటర్‌లో ప్రజలకు టీబీ ముక్తా అభియాన్‌లో భాగంగా క్షయపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..క్షయ నివారణకు సమాజంలో ప్రతీఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. సాధారణంగా దగ్గు, తుమ్ముల సమయంలో గాలిలోకి విడుదలయ్యే చిన్న బిందువుల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. రోగి దగ్గినప్పుడు, మాట్లాడినప్పుడు, తుమ్మినప్పుడు, నవ్వినప్పుడు టీబీ వ్యాపిస్తుందన్నారు. అకారణంగా బరువు తగ్గడం, నిరంతరం దగ్గు రావడం, రాత్రి పూట చెమటలు పట్టడం, విపరీతమైన జ్వరం ఉన్నట్లయితే వైద్యులను సంప్రదించి తగిన వైద్యం తీసుకోవాలన్నారు. టీబీ రోగులకు ఆరు నెలల మందులు ఉచితంగా అందిస్తారని, ప్రతీ నెల రూ.1000 ప్రభుత్వం అందిస్తుందన్నారు. దోమ మండల వ్యాప్తంగా 58 మంది టీబీ పేషెంట్లు ఉన్నారని, అందులో 14 మంది పెషేంట్లను వికారాబాద్‌లోని జిల్లా ఆస్పత్రికి ఎక్స్‌రే నిమిత్తం పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ ప్రభులింగం, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ అఖిల్, టీబీ హెల్త్ విజిటర్ రాజు నాయక్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ఏఈ హరిక్రిష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పరిగి, రాపోల్, రంగంపల్లి, సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు అంతరాయం ఉంటుందని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.


యాదవులను విస్మరించడం సిగ్గుచేటు

దోమ: ప్రభుత్వం మంత్రి పదవుల్లో యాదవులకు సముచిత స్థానం కల్పించకుండా విస్మరించడం సిగ్గుచేటని అఖిల భారత యాదవ సంఘం మండల అధ్యక్షుడు నర్సింహాయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపధికన యాదవులు రెండో స్థానంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం మంత్రి పదవులు ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాదవులను ఓటు బ్యాంకుగా చూడటం సబబు కాదని వివరించారు. ప్రభుత్వం పునరాలోచించి మాజీ మంత్రి అంజన్ కుమార్ యాదవ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవుల్లో చోటు కల్పించాలని కోరారు. లేని పక్షంలో రానున్నకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ పక్కా ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బషీరాబాద్ మండలంలో 461 మంది లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు ఇండ్లు వస్తున్నాయని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్కరికి కూడా ఇల్లు రాలేదని విమర్శించారు. ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించామని, త్వరలో రెండో విడత ఇళ్లు కూడా వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ మహారాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, అజయ్ ప్రసాద్, సీనియర్ నాయకులు వెంకటేశ్ మహారాజ్, శంకరప్ప, కశాల్ నర్సిములు, చందర్, సురేష్, మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఆలయభూమి సర్వే చేయించాలి

- కబ్జాకు గురైన భూమిని రికవరీ చేయాలి
- దేవాదాయశాఖ ఈఓను కోరిన భక్తులు

ధారూరు: ఆలయభూమిని సర్వే చేయించాలని దేవాదాయశాఖ ఈఓ నరేందర్‌ను భక్తులు కోరుతున్నారు. గత మూడు పర్యాయాల నుంచి దేవాలయ భూమిని వేలం వేస్తున్న సమయాల్లో సర్వే చేయించాలని కోరుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని రైతులు, భక్తులు ఈఓ నరేందర్‌ను ప్రశ్నించారు. శుక్రవారం ధారూరు శ్రీవీరభద్రేశ్వరస్వామి దేవాలయ భూమిని వేలం వేసేందుకు వచ్చిన ఈఓ నరేందర్‌ను భక్తులు నిలదీశారు. సర్వే చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రికార్డులో8ఎకరాల 7గుంటల భూమి ఉందని, వాస్తవంగా చూస్తే 5 ఎకరాలు కూడా లేదని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 3 ఎకరాలకు పైగా భూమిని పక్క పొలాల రైతులు కబ్జా చేశారని చెబుతున్నారు. ఈ విషయంలో ఈఓ నరేందర్ ఎందుకు స్పందించడం లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆలయ భూముల విషయంలో సర్వేచేయించి దేవాదాయ భూములను పరిరక్షించాలని భక్తులు కోరుతున్నారు.

మల్లన్న ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న ఆలయ నిర్మాణానికి దాతలు చేవెళ్లకు చెందిన పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, సమత దంపతులు, మాజీ సర్పంచ్ బండారి శైలజ, ఆగిరెడ్డి దంపతులు రూ.30లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు విరాళానికి సంబంధించిన చెక్కును శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.